# 'ఉదీర్ధ్వాం జీవో!!'

[ఊహాచిత్రము]

●

శ్రీ తెన్నేటి సూరి

"ఉదీర్ధ్వం జీవో! అసుర్న ఆగాద్ ప్రపాగ్ అత్తమ అజ్యోతిరేతి
అరైక్పంథాం యాతవే సూర్య ఆగన్మ యత్రః ప్రతిరంతరాయుః" —ఋగ్వేదము

"ఉదీర్ధ్వం జీవో!!!"—

"అబ్బా!......"

"ఉదీర్ధ్వం జీవో!!!"

"ఆ!......నే నెవరను...?"

"ఉదీర్ధ్వం జీవో!"

"అవును......జ్ఞప్తికి వచ్చుచున్నది...మానవుడను"

"ఉదీర్ధ్వం జీవో!"

"నేను బ్రతుకుచున్నానువలె నున్నది—ఏదో ఒక యుగాంతమందు చైతన్యమును కోల్పడి, స్తబ్ధములై, శబ్దగ్రహణపారీణత నశించిపోయిన నా శ్రవఃపుటములలో జివ్వుజివ్వున యేవో విద్యుత్తరంగములు ప్రవహించుచున్నవి."

"శరీరము పులకించుచున్నది—ఈ అంధకారగర్భమునంతయూ జ్వలించుచూ జగత్ప్రబోధకమై, గగనపథమున మొరయుచున్న యీ విశుద్ధగోశధ్వని యెవరిదీ?—యెవరు వారూ?—

"లెమ్ము నాయనా! నేనే!"

"భగవంతుడవా?—"

"కాదు—లేచిరమ్ము"

"విశుద్ధమైన మీ శాంతగంభీరమంగళనిస్వనము పూజ్యపాదులైన నా వంశకర్తల గాత్రధ్వనిని పోలియున్నదే!—యెవరు మీరూ?"—

"దివ్యర్షుల పునీతరక్తము నా నాళములలో ప్రవహించుచున్నది. నా గాత్రమునకు కొంచెమా పోలిక లుండవచ్చును. చిమ్మచీకటు లలమియున్న ఆ యంధకారగుహాకుహరాంతరమునుండి బయటికి లేచి రమ్ము. ఆ మృత్యుగర్భమునుండి బయల్పడుము—ఇచ్చట దిగ్దిగంతముల విస్ఫురితము గావించుచు, ఉజ్జ్వలముగా మహోదయ మగుచున్నది; పునీతములైన యీ అమృతకిరణములలో స్నాతుడవై సజీవుడవు కమ్ము!"—

"ఓ పూజ్యుడా! క్షమించి నన్ను విడువుము; నీకు నమస్కారము చేసెదను—"

"ఎందు కంత కలవరము!"

"నాకు చాల భయముగా నున్నది."

"కారణము?—"

"ఆ తేజఃపుంజములలో నేను బ్రతుకజాలనేమో!—యుగయుగములుగా యీ చీకటిలో బ్రతుకుటకు నా శరీరము అలవాటుపడియున్నది."

"భ్రమపడకుము—అసలు నీ విప్పుడు బ్రతికిలేవు; నీవు తిరిగి సజీవుడవు కావలయునన్న యీ అమృతరేఖలు నీపై ప్రసరింపవలసియున్నది.

"క్షమింపుడు—జీవితాశా...నాకు లేదు."

"వ్యర్థుడవు కాకుము—నీవు బ్రతుకునట్లు చూచుట నా విధి."

"ఆః!...ఎందు కింత బలవంతము?—"

"ముందు లేచివచ్చెదవా?—"

"అంత ఉజ్వలముగా పిలువకు స్వామీ!— ఆ పిలుపు నా కంఠమును పాశమువలె బిగించి, ముందుకు పడనీయ్యకున్నది. పడిపోవుచున్నాను."

"అట్లయిన పిలువను లెమ్ము...నీయంత నీవే నెమ్మదిగా లేచిరమ్ము"—

"నేను చాల బలహీనముగా నున్నానయ్యా! లేచి నిలచిన తూలిపడిపోయెదనేమో...లేచి నిలచుటకు అసలు నా శరీరములో ఎముక లుండవలెనా?—"

"నీ శరీరములో బలిష్ఠమైన ఎముక లున్నవి. నీబలము నీవు తెలుసుకొనజాలకున్నావు—అనంతమైన బలసంపన్నత నీలో కలదు; దైన్యభావములను విదలించివైచుకొని, నీ శక్తినంతయు ఒక్కుమ్మడి జృంభించి, చివాలున లేచి నిలువుము."

"ఆశ్చర్యము స్వామీ! ఇంద్రజాలము వలె నున్నది. నాలోనున్న జీవనాడు లన్నియు కదలి మేల్కొనుచున్నవి. ఆపాదమస్తకము నాశరీరమంతయు యేవో శక్తితరంగములు వ్యాపించుచున్నవి— ఇదుగో! చివాలున లేచినిలచినాను."

"మంచిపని చేసితివి. ఇక కదలిరమ్ము!"

"నా కాళ్లకూ, చేతులకూ లోహశృంఖలములు తగిలించియున్నవి. నడచుటకుమాత్రము వీలుపడదు లెండు."

"అసంభవము—నీవు మానవుడవు—లోహశృంఖలములు నిన్ను బంధింపజాలవు. నిన్ను నీవు బంధించుకొనకున్న, నిన్ను బంధింపగల శక్తి యీ బ్రహ్మాండమున లేదు."

"మరి వీని నేమందురు స్వామీ!"

"నీ పాదముల గమనమును ప్రతిరోధించుచున్నవి లోహములు కావు—నీ ఊహలతో నిన్ను నీవు బంధించుకొనుచున్నావు. అవి విభ్రాంతచేతస్కుడవైన నీ యూహలు—త్రెంచుకొనుము."

"ఏదియో చెప్పుచున్నారు—అయినను ప్రయత్నించిచూచెదను...ఆహా! విపరీతముగానున్నదే!... ఈ లోహములు సర్పములుగా మారి, నా పాదముల నుండి దిగజారి, యీ అంధకారములో లీనమైపోయినవి—సరే, వచ్చుచున్నాను...స్వామీ!"—

"ఏమి నాయనా?"—

"నేను బయటికి రాగలుగుట అసంభవము—నా చుట్టును ఉక్కుతలుపులు మూసుకొనియున్నవి."

"ఇదియు నీయూహాకల్పితమగు మరియొక దుర్భ్రమ; నిశ్శంకుడవై ముందునకు నడచిరమ్ము; నీ ముందు నిరోధము లేవియూ లేవు."

"అబ్బా!..."

"ఏమైనది?"—

"తల పగిలిపోయినది—రక్తము స్రవించుచున్నట్లున్నది."

"కలవరపడకుము—అసలు నీకు దెబ్బతగులనే లేదు."

"క్షమింపుడు—ఏదో తగుల నేతగిలినదని భయపడితిని. అసలిచ్చట నిరోధము లేవియు నున్నట్లు కాని ఎంచుటలేదు. ఉక్కుతలుపులు భూగర్భములోనికి దించుకొనిపోయిన ట్లున్నవి.

"మంచిపని జరిగినది—సరే, ఇక త్వరగా నడచి రమ్ము."

"మీ రేమి చెప్పుచున్నారు—ఈ నిమ్నోన్నతములలో గండుశిలలు తగిలి నా మోకాళ్లు బద్దలై రక్తము లోడిపోవుచున్నవి. కన్నులు పొడుచుకొన్నను కనుపించుటలేదు—ఈ చీకటిలో నడచుటెట్లు? ఎచ్చట నేమి తగిలి తల పగులునో!—అబ్బా!!! ...ఎంత దెబ్బ తగిలినదీ!"—

"తొందరలేదు నాయనా...... నెమ్మదిగా రమ్ము."

"ఈ అంధకారగర్భమున మార్గమే కనుపించుటలేదు—ఎటువైపునకని నడచిరావలయును?"—

"ఇదుగో, నా చిటికెనవ్రేలు పుచ్చుకొనుము— నా అడుగులో అడుగుగా, వెన్ను నానుకొని, నెమ్మదిగా నడచిరమ్ము."

"అబ్బబ్బా ! ఈ కఠోరకంటక శిలాపథమువెంట నీ పయన మింకెంత కాలము?—ఇక... నేనూ... నడువ జాలకున్నానే—నా పాదములు మాంసఖండములుగా ప్రిదిలి రక్తము వరదలై పోయినది. రక్తము ఈ గులక రాళ్ల లోనికి జలజలా యింకిపోవుచున్నది."

"కాదుకాదు ; చైతన్యయుతులమైన, మన పదక్రమములో ఈ శిలాజాలము నిద్రలేచుచున్నది."

"విషసర్పముల ఫూత్కారములవలె యేవివో విషవాయువులు నాచుట్టును ఆవరించి ఉక్కిరి బిక్కిరిగా నున్నది—నాయవస్థను పోల్చుకొనియు మీకు చీమకుట్టినట్లైన కుట్టుటలేదు.

"ఆయుఃప్రదములైన స్వేచ్ఛావాయువులు నిన్న లముకొనుచున్నవి—ప్రాణధారణము చేయుము. మనము గుహాప్రాంగణమును చేరుచున్నాము."

"ఈ గుహాబహిర్భాగమున సహితము మంచు తెరలు గప్పి, యీ వనభూమియంతయు నా మానసము వలెనే అయోమయముగా నున్నదే!"

"క్షణములో సూర్యప్రకాశ మావిర్భవించి ఈ మంచుతెరలను పటాపంచలు చేయగలదు. అప్పుడు యెల్లెడల తేజమే—అదుగో, ఆ శిఖరాగ్రము వంక చూడుము! విజ్ఞానభాస్కరుని స్వర్ణారుణ రేఖలలో నభిషిక్తమై వెలుగులు జిమ్ముచున్నది."

"అబ్బా! భగ్గున కన్నులు తగులబడిపోయి నవే"—

"దివాంధమువలె ఆ మహాతేజమును చూచి కన్నులు మూసికొనకుము—భయము లేదు—ఒక్క సారి కన్నులు విచ్చి చూడుము—ఆ కిరణముల స్పర్శతో నీ కనుపాపలు చైతన్యము నొంది ఆ దివ్య దర్శనమునకు అర్హములు కాగలవు."

"కృతజ్ఞుడను—మహదానందముగా నున్నది. దివ్యతేజోవిరాజితుడగు అరుణదేవునకు మోకరిలి నమస్కరించుకొనవలయునని యుత్కంఠగా నున్నది. అనుమతియా ?"

"ఉపాసింపుము—విజ్ఞానభాస్కరుని ప్రసాదమున నీజీవితము తేజోమయము కాగలదు."

"........................"

"వందనసమర్పణము ముగిసినదా ?—రమ్ము, యీ పర్వతము నధిరోహింతము. దివ్యతేజోవిరాజితమైన ఆ శిఖరాగ్రము మన పరమలక్ష్యము."

"అబ్బో ! అంత యెత్తునకే !—ఇప్పటికే చాల అలసియున్నానే !—ఇక మన మిచ్చట నిలిచిపోగూడదా ?"

"ఈ నైరాశ్యమును వదలుము. నీ విశ్రాంతికి ఇచ్చట స్థావరము లేదు. నీ లీలావసథ మా శిఖరాగ్రముననే యున్నది."

"ప్రభూ !—"

"భయభ్రాంతుడవు కాకుము— ఏమైనది"—

"ఆ కొండచరియయందు...అటుచూడుడు!—"

"ఏమున్నదోయీ ?—"

"జడలు విరియ పర్వతోపమానములుగా ఆ లోయనంతను తమోయుక్తముగా చేసివైచుచు, గంగ శివా లాడుచున్నవి...ఆ పిశాచములు చూడుడు. వాని భయంకరరావములతో నా శ్రవఃపుటములు ప్రిదిలి పోవుచున్నవి.

"అవి పిశాచములు కావు; అంధకారచ్ఛాయలు ఈ దివ్యతేజమును భరింపజాలక అరచుచున్నవి—అవి నిన్నేమియు చేయజాలవు. ముందునకు నడువుము."

"ప్రభూ! అటు చూడుడు. ఆ కిరాతు డెవడో నా సోదరునిపై కత్తి నెత్తుచున్నాడు—వానిని ఛేదించి వత్తునా?"

"ఆ కత్తి నెత్తుచున్నవాడు మాత్రము నీ సోదరుడు కాదటోయీ ?"

"కాడే !"

"నీ యభిప్రాయము ?"—

"మతాంతరుడు—నా మతమునకు విరోధి"

"పవిత్రములైన మతముల మధ్య పరస్పరము విరోధభావ మున్నదని యీ పాడుమాటలు నీ కెవరు చెప్పిరి ?"

"ఎందరు చెప్పుట లేదు ?"—

"ఆ చెప్పుచున్న వారు వట్టి అజ్ఞానులు."

"నా దైవమును దూషించుచున్న ఆ నీచుల సంగతి మీకు తెలియదు కెందు."

"నీ దైవమును దూషించువాడు తన దైవమును తాను దూషించుకొనుచున్నాడు"—

"బాగున్నది మీవాదను"

"ఎవరికైనను ఉన్నవాడు భగవంతుడొక్కడే"

"క్షంతవ్యుడను"—

"అది సరిగాని — ఈ దూషణభూషణముల నుండి భగవంతుని రక్షింపుమని ఈ అధికారము నీ కెవ్వ రిచ్చినారోయీ ?—భగవంతుడు నీ రక్షణలేనిది బ్రతుకజాలనంత బలహీనుడని నీ కెవరు చెప్పిరి?"

"సమాధానము చెప్పకొనజాలనుగాని నా సోదరుని రక్షణమాత్రము నా కవశ్యకర్తవ్యము—ఈ ఖడ్గముతో ఆ కిరాతుని సంహరించుచున్నాను."

"సంహరింపవలసినది ఆ కిరాతుని గాదు; యుగయుగములుగా నీలో స్తబ్ధముగా దాగియుండు నీ బలహీనసమయమును అవకాశముగా తీసికొని పిశాచ రూపమున బయల్పడజూచుచున్న నీ పశుత్వమును"—

"ఏమో వచించెదరుగాని, సోదరుని హత్యను కన్నులార జూచుచూ ఇట్లూరకుండవలసినదే నటయ్యా?"

"హత్యచేయబడనున్న నీ సోదరుని రక్షణార్థము నీ వేమి త్యాగము చేయగలవు?"

"ఏమిచేయను—ప్రాణము లొడ్డెదను."

"ధీరునివలె మాట్లాడితివి—అట్లు చేయుము; నీ సోదరుని కంఠముపై నీకంఠము నాచ్ఛాదనగా నిడి ఆ కిరాతుని ఖడ్గము నాకు బలిగా నొసంగుము"

"నా కంఠము తెగిపో వలయుననియా మీ యూహ ?"

"నీసోదరుడు రక్షింపబడును."

"నా సర్వనాశనముసంగతి తలపోయరేమండీ !"

"నీకు నాశము లేదు—నీవు అనంతుడవు. కన్నులు తెరువుము. కల్పాంతమువరకును నీ దృష్టిని ప్రసరించి చూచుకొనుము—నీవు శాశ్వతుడవు".

"ధన్యోస్మి... నా కంఠమును నా సోదరుని కంఠమునకు రక్షణగా అచ్ఛాదించుచున్నాను."

"అమరజీవివి కమ్ము! ఆ ఖడ్గాఘాతము నీ కంఠమున విజయమాల యగుగాక!—నీ శత్రువులెల్లరు నశించిరి."

"ఓ మహనీయుడా! నన్నాశీర్వదింపుము... మీ దివ్యనామముతో పవిత్రములైన ఆ యక్షరపంక్తి నైన తెలిసికొననైతిని."

"అహంకారములకు తావలములైన ఈ నామములతో పని యేమి నాయనా ?—విజయమూర్తివై నిరంతరాయముగ శిఖరాగ్రము నధిష్ఠింపుము—మంగళ మగుగాక! నీకు సర్వదా నా ఆశీస్సులు కలవు."

"చరితార్థుడను."

"మరి యిక నేను పోయివచ్చెదను...నాకు పిలుపు వచ్చినదే."

"ఆఁ! ఆ!...భయదము!! కర్ణపుటములు చిటిలిపోవునట్లీ పిడుగులురిమిన ప్రళయాంభోద మెవ్వరు!!!—ప్రభూ!!!"

"హారే రాం!!"

"......మహాత్మా!!!..."